క్లుప్తంగా

అన్నప్రసాదం నాణ్యతపై ప్రతి రోజూ నివేదిక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు అందించే అన్న ప్రసాద నాణ్యతపై ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆలయ అధికారులను ఆదేశించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న అన్న ప్రసాద వితరణను శనివారం ఈవో, ఇతర అధికారులు పరిశీలించారు. తొలుత మహా మండపం మూడో అంతస్తుకు చేరుకున్న ఈవో శీనానాయక్, ఏసీ రంగారావు, ఈఈ రాంబాబు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో మాట్లాడారు. అన్న ప్రసాదం కోసం ఎంత సేపటి నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్నారని ఆరా తీశారు. భక్తులకు పంపిణీ చేసే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, భక్తులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజు నాణ్యతపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అన్న ప్రసాద వితరణ జరిగే హాల్స్‌లో ఓం కనకదుర్గాయనమహః శ్లోకం వినిపించేలా మైకులు ఏర్పాటు చేయాలని సూచించారు. మెట్ల మార్గం వద్ద భక్తులు కూర్చునేందుకు తగినన్ని బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు.

దళిత ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

బస్టాండ్(విజయవాడపశ్చిమ): దేశవ్యాప్తంగా దళిత ఉద్యోగులు, అధికారులపై పెరిగిపోతున్న కుల వివక్ష, అవమానాలు, వేధింపులను తక్షణమే ఆపేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ బల్లారపు జగదీష్‌కుమార్ డిమాండ్ చేశారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరియాణకు చెందిన దళితుడైన అడిషనల్ డీజీపీ వై.పురాన్‌కుమార్ తన మరణ వాంగ్మూలంలో కులవివక్షతే తన మరణానికి కారణమని రాతపూర్వకంగా తెలిపి ఆత్మహత్య చేసుకోవడమే దళితుల పట్ల చూపే వివక్షతకు అతిపెద్ద తార్కాణం అన్నారు. ఆయన ఆత్మహత్యపై నిష్పాక్షికమైన సమగ్ర విచారణ జరిపించి, అందుకు కారకులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత అధికారుల పరిస్థితే ఈ విధంగా ఉంటే, సమాజంలో సాధారణ దళితుల జీవన స్థితిగతులు ఎంత అధ్వానంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కిషోర్ బాబు, కోశాధికారి బాలాజీ, కార్యవర్గ సభ్యుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారిపై టీడీపీ నేతల దౌర్జన్యం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ భవానీపురంలో రోడ్డు పక్కన ఇడ్లీ బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఓ చిరు వ్యాపారిపై అధికార టీడీపీ నేతలు జులుం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే ... భవానీపురం క్రాంబే రోడ్డులోని శివాలయం సెంటర్‌కు సమీపంలో ఓ ఖాళీ స్థలం ఎదుట రోడ్డు పక్కన ఏడాదిన్నరగా ఇడ్లీ బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అక్కడ బండి పెట్టుకున్నందుకు ఖాళీ స్థలం యజమానికి ప్రతి నెల రూ.12 వేలు అద్దె చెల్లిస్తున్నాడు. భవానీపురానికి చెందిన అధికార టీడీపీ నేత, మాజీ కార్పొరేటర్, 41వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావు, 40వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య అతని దగ్గరకు వచ్చి తమకు రూ.60వేలు ఇవ్వాలని, లేదంటే జేసీబీతో బండిని తొలగించి అవతల పడేస్తామని హెచ్చరించారు. తాను రూ.60వేలు ఇవ్వలేనని, రూ.20వేలు, అది కూడా రెండు దఫాలుగా ఇస్తానని వేడుకున్నాడు. అయినప్పటికీ వారు కనికరించలేదు. శుక్రవారం అర్ధరాత్రి ఇడ్లీ బండిని జేసీబీతో తొలగించి రోడ్డుకు అవతల వైపు పడేశారు. శనివారం ఉదయం శివ వచ్చి చూడగా ఇడ్లీ బండి కనిపించలేదు. రోడ్డుకు అవతల వైపు పడేసి ఉండటంతో వెళ్లి చూసుకున్నాడు. జేసీబీతో తొలగించడంతో సామగ్రి పాడైపోయిందని బాధితుడు శివ కన్నీటి పర్యంతమయ్యాడు. వారిద్దరిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు. పత్తి నాగేశ్వరరావు, చిన్న సుబ్బయ్య కలసి చిరు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు కూటమి నేతలే చెబుతుండడం గమనార్హం.

ఉధృతంగా కోటి సంతకాల సేకరణ



44వ డివిజన్‌లో కరపత్రాలను అందిస్తున్న సాయిబాబు



40వ డివిజన్ ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్‌లో సంతకాలు సేకరిస్తున్న రాజశేఖరరెడ్డి



చర్చి సెంటర్‌లో సంతకాలు సేకరణ చేపట్టిన కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేట్‌పరం చేసేందుకు యత్నించటాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఉధృతంగా సాగుతోంది. విద్యాధరపురం చెరువు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ 44వ డివిజన్ ఇన్‌చార్జ్ పెద్ది సత్య సాయిబాబు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. కార్యక్రమంలో పలగాని శివరామ్, గద్దా రమేష్, వల్లం రవి, షఫీఉల్లా, బొండా నిరీష్, వి.మధులీల, శర్మ మాస్టర్, వెలంపల్లి సుబ్బారావు, కె.దుర్గారెడ్డి, పి.రమేష్, ఎండీ ఉస్మాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో...

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ భవానీపురం 40వ డివిజన్ పరిధిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీ దొడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్‌లో డోర్ టు డోర్ తిరిగి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైద్య కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద ప్రజలకు జరిగే నష్టాలను వివరించారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ప్రభుత్వం నిర్వహించాల్సిన సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ వాటి ఆస్తులను ఇతరులకు కట్టబెడుతున్నారని, తద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో కోటి సంతకాల సేకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం 43వ డివిజన్ పరిధిలోని చర్చి సెంటర్‌లో శనివారం కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ జరిగింది. బైపాస్ రోడ్డులోని చర్చి సెంటర్ సమీపంలో శిబిరం ఏర్పాటు చేసి సంతకాలు సేకరించారు. సంతకాల సేకరణకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి తెలిపారు. ఆటో రిక్షా కార్మికులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు శిబిరం వద్దకు వచ్చి స్వచ్ఛందంగా ఫారాలపై సంతకాలు చేశారు. మానవ మందిరం రోడ్డులోనూ సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, కంది శ్రీనివాస్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ కేసర కృష్ణారెడ్డి, ఎస్వీ రెడ్డి, వేమిరెడ్డి హుస్సేన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శివరామిరెడ్డి, చిన్నారెడ్డి, కరీం ఖాన్, భవాని, మంగారెడ్డి, మద్దు బాలు, ఏవీరెడ్డి వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి కేసులో ఇరువురికి జైలుశిక్ష

విజయవాడలీగల్: విజయవాడకు చెందిన న్యాయవాది సోగాని రమేష్ కుమార్‌తోపాటు పాము రమేష్‌పై దాడి చేసిన కలపాల రాధాకృష్ణ, జువ్వనపూడి ఆనంద్‌బాబు ఇరువురికి జైలుశిక్ష విధిస్తూ బంటుమిల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 2019 జూన్ 23వ తేదీన న్యాయవాది రమేష్ జయపురం కాంప్లెక్స్ రోడ్డులో చెరువులను శుభ్రం చేసేందుకు పాము రమేష్‌ను తీసుకొనివెళ్లారు. చెరువులో రమేష్ కొబ్బరి ఆకులు ప్రోగుచేస్తుండగా, లోగడ ఆ చెరువు లీజుకు తీసుకున్న కలపాల రాధాకృష్ణ అక్కడకి వచ్చి న్యాయవాదితో గొడవపడి దాడి చేస్తుండగా పాము రమేష్ అడ్డుకున్నాడు. కలపాల రాధాకృష్ణతోపాటు కలపాల శ్రీను, జువ్వనపూడి ఆనంద్‌బాబు వారిరువురిపై కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో పాము రమేష్ తలకు గాయం, రమేష్‌కుమార్‌కి కాలికి గాయాలయ్యాయి. పాము రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గంగామణి ఏడుగురు సాక్షులను విచారించారు. నిందితుల్లో ఒకరైన కలపాల శ్రీను 2023 మే 14న చనిపోగా, మిగిలిన ఇరువురి నిందితులపై నేరం రుజువైనందున రాధాకృష్ణకు 5 నెలలు జైలు, రూ. 3వేల జరిమానా విధిస్తూ, జరిమానా కట్టలేని పక్షంలో మరో 15 రోజుల సాధారణ జైలు, అలాగే జువ్వనపూడి ఆనంద్‌బాబుకు 3 నెలలు జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ ఎం.భాస్కరరావు తీర్పునిచ్చారు.

ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో రైల్వే ఉద్యోగుల ప్రతిభ



ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్ గెలుచుకున్న రాజేంద్రప్రసాద్, సంపత్‌కుమార్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఉద్యోగులు ప్రతిభ చాటుకున్నారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన ఈ ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ 45 ప్లస్ విభాగంలో రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అడిషనల్ రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌లో టెక్నీషియన్ సంపత్‌కుమార్ రైల్వే జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో తమ సమీప ప్రత్యర్థులైన గంజి వెంకటేశ్వర్లు, శంకర్ నాయుడులపై అత్యుత్తమ ఆటతీరు కనపర్చి టైటిల్ సాధించారు. వీరితో పాటుగా మరో రైల్వే ఉద్యోగి ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు, శివ 55ప్లస్ విభాగంలో రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, సహచర ఉద్యోగులు వారికి అభినందనలు తెలియజేశారు.

విద్యతోపాటు నైపుణ్యం ఉంటేనే విజయం

- కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు
- వేడుకగా నలంద డిగ్రీ కాలేజీ ఫ్రెషర్స్ డే



ప్రొఫెసర్ బసవేశ్వరరావును సత్కరిస్తున్న రామకృష్ణ, అనూరాధ, విజయబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యతోపాటు లైఫ్ స్కిల్స్ (నైపుణ్యం) నేర్చుకుంటేనే ఎక్కడికి వెళ్లినా విజయం సాధించవచ్చని కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ వేడుకల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్య ఒక్కటే చాలదని, అన్ని రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. అందుకు కృష్ణా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో కమ్యూనికేషన్స్ స్కిల్స్ ప్రత్యేక స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాలలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, అయితే వాటి నిర్వహణకు యువతకు సరైన నైపుణ్యం లేకపోవడం వలన ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ స్కిల్స్, క్యాంపస్ సెలక్షన్స్‌లో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన నలంద డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు డిగ్రీ కోర్స్ పూర్తయ్యేలోగా ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

పొట్టిశ్రీరాములు కాలేజీలో ముందస్తు దీపావళి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పర్వదినం అని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు అన్నారు. కళాశాల పీజీ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి సంబరాలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తమసోమా జ్యోతిర్గమయ (చీకటి నుంచి వెలుగు) నృత్య రూపకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. తొలుత లక్ష్మీపూజను నిర్వహించారు. నరకాసుర దహనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూరపాటి స్కూల్‌లో ముందస్తు దీపావళి

అసత్యం నుంచి సత్యంలోకి, చీకటి నుంచి వెలుగులోకి, చెడు నుంచి మంచిలోకి ప్రజలను నడిపించే పర్వదినం దీపావళి అని కూరపాటి చంద్రశేఖరరావు హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అన్నారు. పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలను విద్యార్థులు కోలాహలంగా జరుపుకొన్నారు. తొలుత లక్ష్మీదేవికి గులాబీ పూలతో, దీపాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి సందడి చేశారు.

కొల్లూరి సాహితీ సేవలు ఆదర్శం



కొల్లూరి సంస్మరణ సభలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు, సాహితీవేత్తలు

విజయవాడ కల్చరల్: కొల్లూరి సాహితీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కామ్రేడ్ జీఆర్‌కే సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో శనివారం సాహితీవేత్త, సంపాదకుడు కొల్లూరి సంస్మరణ సభను నిర్వహించారు. కవి సత్రీ మాట్లాడుతూ నెలనెలా వెన్నెల కార్యక్రమం ద్వారా ఎందరో యువ కవులకు వేదిక కల్పించినట్లు గుర్తుచేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు, కార్యదర్శి పి. లక్ష్మయ్య, బోడి ఆంజనేయరాజు, నండూరి రాజగోపాల్, కవులు అరసవిల్లి కృష్ణ, చలపాక ప్రకాష్, శర్మ, శింగపల్లి అశోక్‌కుమార్, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, ఆంజనేయ కుమార్ మందరపు హైమావతి తదితరులు మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మూడో శనివారాన్ని పురస్కరించుకొని డీఈవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర పేరుతో ప్రాంగణాన్ని శుభ్రపరచటం, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

ఆలయ సంప్రదాయాలకు తిలోదకాలు!

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి సంప్రదాయాలకు, ఆచారాలకు అధికారులు, ట్రస్ట్ బోర్డు తిలోదకాలు ఇస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి ప్రతి నిత్యం ప్రముఖులు, అధికారులు, ప్రొటోకాల్ ఉన్న ప్రముఖులు విచ్చేస్తుంటారు. వీరిలో మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి, ఉప ముఖమంత్రులకు వీవీఐపీ ప్రొటోకాల్ ఉంటుంది. అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించే ముందు వీవీఐపీలకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలుకుతారు. అయితే శనివారం అందుకు విరుద్ధంగా ప్రొటోకాల్ లేని వారికి సీఎం పేషీ నుంచి చెప్పారనే కారణంతో మేళతాళాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. సినీ రంగానికి చెందిన ఓ వ్యక్తికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించాలని ఈవో కార్యాలయానికి సమాచారం అందింది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆ వ్యక్తి నేరుగా చైర్మన్ రాధాకృష్ణ చాంబర్‌కు చేరుకున్నారు. ఇంతలో విషయం తెలుసుకున్న ఈవో శీనానాయక్ కూడా చైర్మన్ రూమ్‌కు ఎదురు వెళ్లి సదరు వ్యక్తిని సాదరంగా స్వాగతం పలికారు. అయితే అక్కడి నుంచి రాజగోపురం చేరుకునే సరికి ఆలయ మేళం బృందం వారికి సాదరంగా స్వాగతం పలకడం ఆలయ ఉద్యోగులందరినీ విస్మయానికి గురి చేసింది. గతంలో ఎటువంటి ఆర్భాటం లేకుండా అమ్మవారి దర్శనం చేసుకున్న ఆయనకు ఇప్పుడు ప్రొటోకాల్ పెట్టడంపై సర్వత్రా విమర్శలకు దారి తీసింది. దర్శనం పూర్తయిన తర్వాత వేద ఆశీర్వచనం, పట్టువస్త్రాలు ఇక సరేసరి... తిరిగి వెళ్లే సమయంలోనూ మేళంతోనే వారిని సాదరంగా సాగనంపడం గమనార్హం.

అయ్యప్ప దుస్తులతో స్కూల్‌కి హాజరుపై వివాదం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న ఇద్దరు విద్యార్థులు మాల ధారణ దుస్తులతో శనివారం పాఠశాలకు రావడంపై విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్ యాజమాన్యం అభ్యంతరం తెలిపింది. స్కూల్ యూనిఫాం మాత్రమే ధరించి రావాలని అనగా, యూనిఫాంపై అయ్యప్ప కండువా వేసుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. అయినా స్కూల్ యాజమాన్యం అందుకు ఒప్పుకోలేదు. డీఈఓ ఉత్తర్వులు ఉంటే అనుమతిస్తామని చెప్పారు. దీంతో వివాదం ఏర్పడింది. విషయం తెలిసిన విశ్వహిందూ పరిషత్ సభ్యులతో పాటు కొందరు స్వాములు, స్థానిక బీజేపీ నాయకులు రంగప్రవేశం చేయటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న భవానీపురం పోలీస్ స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు తన సిబ్బందితో వచ్చి ఇరువర్గాలకు సర్ది చెప్పారు. మాలధారులు దీక్ష దుస్తులతో స్కూల్‌కు రావచ్చని, అందుకు సంబంధించిన జీవో కాపీ పంపిస్తానని ఎంఈఓ సోమశేఖర్ నాయక్ చెప్పటంతో గొడవ సద్దుమణిగింది.

కృత్రిమ మేధపై అవగాహన అవసరం

విజయవాడలీగల్: న్యాయవాదులు అందరూ కృత్రిమ మేధ(ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె. బాషా పేర్కొన్నారు. ది ఏపీ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, బీబీఏ సంయుక్తంగా ఏఐపై ఒకరోజు అవగాహన సదస్సును బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలోని కె.ఎల్.రావు భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎ.కె. బాషా, 2వ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ అధ్యక్షత వహించగా, చైర్మన్ సంపర దుర్గా శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వకుళాదేవి ఆధ్వర్యంలో జరిగింది. బాషా మాట్లాడుతూ గతంలో జూనియర్ న్యాయవాదులు ప్రతి డ్రాఫ్టింగ్ కోసం సీనియర్ న్యాయవాదులపై ఆధారపడేవారని, ఇప్పుడు కృత్రిమ మేధ సాయంతో వారి డ్రాఫ్టింగ్‌ను వారే సొంతంగా చేసుకోగలుగుతున్నారని తెలిపారు. అలాగే ఇంగ్లిష్‌ను కూడా అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సత్యానంద్ మాట్లాడుతూ జడ్జిమెంటు 15 పేజీలు ఉంటే, మనం క్లుప్తంగా తెలుసుకునేందుకు కృత్రిమ మేధ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన బాషాను అభినందించారు. ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస చక్రవర్తి కృత్రిమ మేధపై మెళుకువలు వివరించారు. కార్యక్రమంలో 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, 200 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అనుబంధ విభాగ కమిటీల నియామకం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగ కమిటీలను నియమించారు. ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా మైలవరం నియోజకవర్గానికి చెందిన గుంజా శ్రీనివాసు నియమితులయ్యారు.

ఎన్టీఆర్ జిల్లా అనుబంధ విభాగ కమిటీలు

బీసీ సెల్ కమిటీ ఉపాధ్యక్షులు మద్దెల పవన్, చెన్ని రాంబాబు, కలసాని చెన్నారావు, ప్రధాన కార్యదర్శులు నాగళ్ల నరసయ్య, ఓర్సు జ్వాలా, కోనాకి ముక్కంటి, పరసా నెహ్రూజీ, కొరగంజి సత్యనారాయణ, పొట్నూరి దుర్గా ప్రసాద్‌తో పాటు 10 మంది కార్యదర్శులు, 8 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

జిల్లా ఐటీ వింగ్ కమిటీ...

కమిటీ ఉపాధ్యక్షులుగా సీహెచ్ నారాయణరెడ్డి, షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శులుగా చేతన్‌రెడ్డి, రాఘవరపు వినాయకరావు, మేడా శ్రీనివాసరావు, గుడిసె ప్రభాకరరెడ్డి, పొన్నం కిరణ్, 8 మంది కార్యదర్శులు, 14 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

లీగల్ సెల్ కమిటీ..

జిల్లా ఉపాధ్యక్షులుగా మందపాటి బసవారెడ్డి, అత్తలూరి ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బెజవాడ భిక్షమయ్య, కొమ్ముకూరి చంటిబాబు, గోగిరెడ్డి కృష్ణారెడ్డి, తోట శ్రీనివాసరావు, అల్లా భక్షు, 8 మంది కార్యదర్శులు, 9 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

జిల్లా మహిళా విభాగ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఇందుపల్లి సుభాషిణి, ఎండీ సల్మా సుల్తానా, ప్రధాన కార్యదర్శులుగా బచ్చు మాధవి, తుమ్మలపల్లి శ్రీదేవి, ఉప్పల్ల వెంకట లక్ష్మి, కొండ పద్మ, బండారి పద్మావతి, వద్దాది అనిత, 8 మంది కార్యదర్శులు, 13 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు

జిల్లా ఎస్సీ విభాగ కమిటీ

ఉపాధ్యక్షులుగా కుక్కల శ్రీధర్, తాండ్ర ఇంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శులుగా అంబడిపూడి శేఖర్‌బాబు, కోట పుల్లారావు, జంగం కాశేశ్వర రావు, నల్లమోతు దుర్గారావు, పిల్లి జయరాజు, 12 మంది కార్యదర్శులు, 13 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు...

గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా తిరువూరు బాజీ కరీముల్లా, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా రజనీ సుధాకర్, ఆర్టిసన్ సెల్ అధ్యక్షుడిగా యడవల్లి ఖాజా రహంతుల్లా, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా బత్తుల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

కాలుష్య రహిత రాష్ట్రం లక్ష్యంగా కృషి చేయాలి

వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్



45వ డివిజన్ లక్ష్మీనగర్‌లో మొక్క నాటుతున్న చంద్రశేఖర్, శ్రీధర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల స్వచ్ఛ వాయువు - మన ఆయువు అనే అంశంపై స్వచ్ఛత, కాలుష్య రహితంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వాయు కాలుష్యం తగ్గించేందుకు ప్రజలందరూ పర్యావరణ హితమైన రవాణాను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజినీర్ ఆర్.ప్రభాకరరెడ్డి, యూసీడీ పీఓ పి.వెంకట నారాయణ, సర్కిల్-1 జోనల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు పాల్గొన్నారు.

38వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్‌లో

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, స్పెషల్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, 119 సచివాలయం అడ్మిన్ ఏబేలు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి



పుట్టిన రోజున మొక్క నాటుతామని ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తమ పుట్టిన రోజున ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలనే సంకల్పాన్ని తీసుకోవాలని ఏపీ అటవీ అభివృద్ధి సలహాదారు కొమర అంకారావు పిలుపునిచ్చారు. కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శనివారం పర్యావరణ పరిరక్షణ-మనందరి బాధ్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన కొమర అంకారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు కోట్ల మొక్కలను నాటించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం ఉంటాయనే విషయాన్ని ముందుగా విద్యార్థులు తెలుసుకుని, ఆ విషయాలను ఇంట్లో తల్లిదండ్రులు, బంధువులకు తెలపాలన్నారు. ప్రతి ఇంటి పెరట్లో తులసి మొక్కతో పాటు మునగ, వేప, కొండపిండి, సరస్వతి వంటి చెట్లను నాటుకోవాలని, వాటి ఆకుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రతి ఏడాది పుట్టిన రోజున ఒక మొక్కను తప్పక నాటుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇంటి మిద్దెపై తోటలను పెంచడంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వన్ ఎర్త్ వన్ లైఫ్ టీం అధినేత లీలా అన్నారు. గత ఏడాది కాలంగా తమ ఇంటి మిద్దెపై మొక్కలను నాటి వాటి ద్వారా అనేక కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడమే కాకుండా మానసికంగా కూడా ఎంతో ఆనందాన్ని పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.రఘుబాబు, స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రేణుకాదేవి, మిద్దె తోటల నిపుణులు కమలాకర్, చాపరాల విజయలక్ష్మి, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రా

సైకిల్ ర్యాలీ, వ్యర్థాల తొలగింపు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ ఈశ్వరబాబు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ వాయు ప్రతిజ్ఞ, సైకిల్ ర్యాలీ, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, బోర్డు సభ్యులు, సిబ్బంది పాలప్రాజెక్టు ఆవరణలో స్వచ్ఛ ఆంధ్రా- శుభ్రమైన వాయు ప్రతిజ్ఞను నిర్వహించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు, సమితి అధికారులు సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, స్వచ్ఛ ఆంధ్రకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చైర్మన్, ఎండీ, పాలక వర్గ సభ్యులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాలప్రాజెక్టు నుంచి వీఎంసీ కార్యాలయం ఎదుట ఉన్న గ్రౌండ్ వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ సీతమ్మ వారి పాదాల వరకు చేరుకోగా, అక్కడ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఆయా పరిసరాల్లో ఉన్న మొక్కలకు నీళ్లు పోసి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని పిలుపునిచ్చారు. నగరవాసులందరూ స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, శుద్ధమైన రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, యూనియన్ పాలక వర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, నెక్కళపు వాణిశ్రీ, నెలకుదిటి నాగేశ్వరరావు, ఇంజం రామారావు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.